# ఓటరు స్లిప్పులు అందరికీ అందించాలి



సమావేశానికి హాజరైన అధికారులు, పార్టీల ప్రతినిధులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

- పోలింగ్ కేంద్రాల చిరునామా పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా
- పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 6 : ఓటరు స్లిప్పులు ప్రతి ఒక్కరికి అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన వివిధ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాను పరిశీలించాలని పేర్కొన్నారు. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే వాటిని సరి చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని 8 మండలాల్లో 317, మంథని నియోజక వర్గంలో 5 మండలాల్లో 130 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని అన్ని రాజకీయ పార్టీలకు అందించామని, పోలింగ్ కేంద్రాల పేర్లు సవరించాల్సిన అవసరం ఉంటే వెంటనే తహసీల్దార్లకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లు కేంద్రాలకు చేరుకునేలా ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులు అందించాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నియమావళి, నిర్వహణపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ముకునూరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ కిరణ్ ఖరే
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

పలిమెల, నవంబర్ 6 : ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. సోమవారం మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఫెర్రి పాయింట్లను పరిశీలించారు. మావోయిస్టులు గోదావరి తీరం దాటేందుకు అనుకూలంగా ఉన్న సర్వాయిపేట, దమ్మూరు, బూర్గుగూడెం, నీలంపల్లి, బండారిగూడెం గ్రామాల్లోని ఫెర్రి పాయింట్లను తనిఖీ చేశారు. పలిమెల, ముకునూరు గ్రామాల్లో నివాసముంటున్న గొత్తికోయల గూడెంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో తగు సిబ్బందిని నియమించి ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఎస్పీ వెంట మహదేవపూర్ సీఐ కిరణ్, పలిమెల ఎస్సై తమాషారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీకి నారాయణరెడ్డి గుడ్ బై

### ఆ పార్టీలో చేరిన వారానికే బయటకు..



కాటారం, నవంబర్ 6 : ఇటీవల బీజేపీలో చేరిన కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీ లో క్రియాశీలక పాత్ర పోషించిన చల్లా వారం కింద బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంథని అభ్యర్థిగా చందుపట్ల సునీల్‌రెడ్డి పేరును ఆ పార్టీ నాయకత్వం ఖరారు చేసింది. దీంతో భంగపడిన నారాయణ రెడ్డి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని చెప్పి ఆ పార్టీ అధిష్ఠానం మాట తప్పడంతో మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖను పంపించినట్లు తెలిపారు.



నగరంపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సాంబమూర్తి

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### గణపురం ఎస్సై సాంబమూర్తి

గణపురం, నవంబర్ 6 : మండలంలోని గ్రామాల్లో ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసకుంటామని ఎస్సై మచ్చ సాంబమూర్తి హెచ్చరించారు. సోమవారం నగరంపల్లి, బుర్రకాయల గూడెం, అప్పయ్యపల్లి, కొండాపూర్ గ్రామాల్లోని ప్రజలతో పోలీసులు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎన్నికల ప్రచారానికి వచ్చినవారితో గొడవ పడొద్దని, వ్యక్తిగతంగా దూషించవద్దన్నారు. ఈనెల 30న ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..

- కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

గంగారం, నవంబర్ 6: మండల పరిధిలోని జంగాలపల్లిలో సోమవారం ములుగు నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఆమెకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. బతుకమ్మలతో డప్పు చప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ మహిళలు మంగళహారతి పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం నాగజ్యోతి సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తనను ఆదరించి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమైక్య పాలనలో చాలా కోల్పోయామని, కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని సూచించారు. ఆయా పార్టీలు ప్రకటించే గ్యారెంటీ లేని హామీలపై ప్రజలకు నమ్మకం లేదని ఎద్దేవా చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యం, ఆరోగ్య బీమా, రూ.400లకే గ్యాస్, అర్హులైన మహిళలకు రూ.3000 జీనవన భృతి, పింఛన్లు పెంచి ఇస్తానని పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం కోమట్లగూడెం కోదండ రామాలయంలో అర్చకులు నాగజ్యోతి గెలుపు కోసం ప్రత్యేక పూజలు చేశారు. కాగా, మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలను నుంచి యువత, మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరారు. వారికి నాగజ్యోతి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి కష్టసుఖాల్లో తోడుంటానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి, దేశిడి శ్రీనివాస్‌రెడ్డి, మండల సీనియర్ నాయకుడు ఈసం సమ్మయ్య, మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సర్పంచ్‌లు గొగ్గల సుగుణ, ఈసం కాంతారావు, ఈసం రమ, గ్రామ అధ్యక్షుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రచారంలో నాగజ్యోతికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



గోవిందరావుపేటలో కురుస్తున్న వాన

## గోవిందరావుపేటలో భారీ వర్షం

గోవిందరావుపేట, నవంబర్ 6 : మండలంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మబ్బులు కమ్మి అరగంట పాటు వర్షం కురిసింది. అకాల వర్షంతో వరికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. వర్షంతో పొలాల్లో దోమ ఉధృతి పెరిగి పంట నష్టం జరుగుతుందని రైతులు వాపోయారు.

## ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

భూపాలపల్లి రూరల్, నవంబర్ 6: భూపాలపల్లి జిల్లాలోని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా నవంబర్ 14వ తేదీ వరకు వార్షిక పరీక్ష ఫీజును చెల్లించవచ్చని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి కే దేవరాజం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు రూ.510, ద్వితీయ సంవత్సరం రూ.730 కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి వార్షిక పరీక్ష ఫీజుగా చెల్లించాలని పేర్కొన్నారు. రూ.100 అలస్య రుసుముతో నవంబర్ 23, రూ.500 లతో డిసెంబర్ 4, రూ.100తో డిసెంబర్ 13, రూ.2000 తో డిసెంబర్ 20 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు.

## కేయూ స్పోర్ట్స్ బోర్డుగా కార్యదర్శిగా శ్రీనివాసరావు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6 : కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శిగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ ప్రొఫెసర్ పీ శ్రీనివాసరావును నియమిస్తూ రిజిస్ట్రార్ టీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన దివ్యాంగుల సెల్ సంచాలకుడిగా, అడ్మిషన్ల డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్‌గా, యూనివర్సిటీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా ఉన్నారు. అలాగే, కేయూ పరిధిలోని కొత్తగూడెం ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఈఈఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ జగన్మోహన్ రాజును నియమించారు.

## గణితంలో మాస్టర్స్‌కు ఉచిత శిక్షణ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6 : దేశంలో ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో మాస్టర్స్ చదవడం కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు గణితంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగయ్య తెలిపారు. జాతీయస్థాయిలో ఫిబ్రవరిలో నిర్వహించే ఐఐటీ జామ్ (జాయింట్ అడ్మిషన్ ఫర్ మాస్టర్స్), సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షల కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు రోజు సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మోడల్ టెస్ట్ సిరీస్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. కరోనా నుంచి ఏటా గణిత అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలకు 9701275354 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# బీఆర్ఎస్ భద్రాచలం అభ్యర్థి నామినేషన్



ఆర్డీఓ మంగీలాల్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు

### ఆర్డీవోకు పత్రాలు సమర్పించిన తెల్లం వెంకట్రావు

భద్రాచలం, నవంబర్ 6 : భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం నామినేషన్ వేశారు. శాసనసభ ఎన్నికల్లో ముఖ్య ఘట్టాన్ని ఆయన పూర్తి చేశారు. నామినేషన్ ప్రక్రియ ఈ నెల 3 నుంచి 10వరకు కొనసాగనుంది. అభ్యర్థులు శుభ ముహూర్తాలు, జాతకాలను పండితులకు చూపించి వారు సూచించిన రోజున నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అలాగే తెల్లం వెంకట్రావు సోదరి, దుమ్ముగూడెం జడ్పీటీసీ తెల్లం సీతమ్మ కూడా బీఆర్ఎస్ తరపున సోమవారం నామినేషన్ వేశారు. ఈ నెల 4న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన చర్ల మండలం రైస్‌పేటకు చెందిన పాండ్రు హేమా సుందర్ రెండో సెట్‌ను ఆర్డీఓ మంగీలాల్‌కు అందజేశారు. కాంగ్రెస్ నుంచి పొదెం వీరయ్య, బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మారావులతో పాటు ఇతర స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్ వేయాల్సి ఉంది. ఈ నెల 9న పొదెం వీరయ్య నామినేషన్ వేసేందుకు ముహూర్తం నిర్ణయించుకోగా, బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మారావు ఈ నెల 8న నామినేషన్ వేయనున్నట్లు సమాచారం.